**జో**రుగా వీస్తున్న గాలికి చెట్లన్నీ ఊగుతున్నాయ్.

ప్రకృతి పూనకం వచ్చినట్లుగా ఊగిపోతోంది. "హ్రుం హ్రీం" శబ్దాల్లా అప్పుడప్పుడూ ఉరుములు ఫెళఫెళలాడేస్తున్నాయి. సమయం సాయంత్రమే అయినా రాత్రయినట్లు భ్రమపడి ముసురు చాటుతో చీకటి కూడా వచ్చేసింది.

ఆకాశంలో ఎక్కడా చిన్న సందు కూడా లేకుండా మబ్బులు....మబ్బులు....ఒకటే మబ్బులు... మరికొద్ది సేపట్లో వర్షిద్దామని తమలో తాము నల్లగా గుసగుసలాడుతున్నాయి.



సముద్రపొద్దున ఉన్న ఆ పల్లెలోని ప్రతి ఇంటినీ సముద్రపు గాలి తట్టి భయాన్ని మేల్కొలుపుతోంది. ఆ పల్లెకి "సీతాపుర"మని పేరు.

రామాపురమని ఎందుకు పెట్టలేదు దేవరా?

ఈ పల్లెకి క్రోసెడు దూరంలోనే మరో "రామాపురం" ఉందిగదరా పాపురా! అదీకాక ఆ పల్లెకూ, ఈ పల్లెకూ మధ్య దగ్గర బంధుత్వాలూ!"

ఆంధ్రదేశంలోని అన్ని పల్లెల్లాగే ఆ పల్లెకూడా ఓ తోక 'గూడెం'. అంటరానితనపు చిహ్నాలు—పూరిగుడిసెలు. అందులో జీవించే ముసలి ముతకా, పెద్దా చిన్నా, పిల్లా మేకా.

వీళ్ళంటే గాలికూడా అలుసేనేమో! పల్లెలో ఇళ్ళనేమీ కదల్చలేక ఆ కోపంతో సమరోత్సాహంతో గూడెంలోని తాటాకు కప్పులకు తన ప్రతాపం చూపెడుతోంది. గూడెమంతా ముసుగేసుకుని గడగడా వణుకుతోంది.

"ఎవరెహె" కుక్కిమంచంలో జోగుతున్న "రాములు" గట్టిగా కేకెట్టాడు తుళ్ళిపడిన 'సెంద్రి' చీదరించుకుంది

. "గాలని సెప్పుంటే నీకాదూ! ఇయ్యేళప్పుడు నిన్నెదుక్కుంటూ ఏ మారాజొత్తాడు. తాగొచ్చి మంచమెక్కడం. పొలికేకలెట్టడం. వసోడున్నాడన్న ఎరికేలేదు. సీ సీ" మళ్ళీ ముడుచుకుని ముసుగెట్టి గట్టిగా గొణిగాడు. ఆ గొణుగుడులో పెళ్ళం 'సెంద్రి'పై తన అభిప్రాయాన్ని, జ్ఞానపైగల కచ్చినీ తెలియచేశాడని అర్థం కావడం కష్టం.

గాలి జోరుగా మళ్ళీ ఆ తడిక తట్టింది.


ఈసారి రాములు లేవలేదు. క్రింద ముడుచుకు పడున్న ఆరేళ్ళ "లచ్చి" నిద్రలోనే ఉలిక్కిపడింది.

"నన్ను కొట్టద్దు నన్ను కొట్టద్దే" ముసురట్టిందని ఎల్ల నేదు. తగ్గంగానే ఎల్తానే పన్లోకి నిద్రలోనే దెబ్బల్ని తప్పించుకోడాని కన్నట్లుగా చేతులడ్డెట్టింది.

"ఊరోకెవే! నివ్వాక త్తివి మద్దైన పన్లోకెళ్ళలేదని పళ్ళు పులిసిపోయేలా ఆడు కొట్టడమూ బానేవుంది. ఇది ఏడ్వడమూ బానేవుంది. మద్దైన ఈ సంటోడు లేకాడంటే మాత్తరం సద్దడం నావల్లయ్యే పనిగాదు" గొణుక్కుంది సెంద్రి.

"ఏంటే తిత్తన్నావ్ "రాములు" పొలికేక.

"నిన్ను కాదులేరా! నివ్వు పడుకుని సావు" నెత్తికొట్టు



కుంది. మళ్ళీ తడిక చప్పుడయింది. ఈసారి 'గాలి' కాదు 'గాలి వా.ర్త'తో ఊరదు.

"ఒరే రాములూ ! సంద్రం పొంగుతాందటలేరో ! గూడెమంతాఊళ్ళోకెల్తాంది తొరగా సరుదుకువిరా! యమరిజెంటు ఆఁ" బాధ్యత పూర్త యినట్టుగా పరిగెత్తిపోయాడు.

గోడకొట్టిన బంతిలాగా లేచి కూర్చున్నాడు రాములు.

మత్తంతా దిగిపోయింది. మత్తే కాదు. చలికూడా ఎగిరిపోయింది. కొద్దిగా వణికాడు.

"ఓర్నాయినో గుండెలు పట్టుకుని కూలబడింది "సెంద్రి". ఇద్దరికీ ఒక్కసారిగా ఏణ్ణర్థం క్రిందట వచ్చిన ఉప్పెన. చనిపోయిన అత్తమామలూ. బంధువులూ వల్లకాడైన ఊరూ గుర్తు కొచ్చాయి.

"అలా సూత్తావేమే, గుడ్డెట్టుకుని. తొరగా లేసి పదవే 'గాలి కన్నా జోరుగా కేక వేశాడు. నిద్రపోతున్న 'లచ్చి' ఉలికిపడిలేచి ఏం జరుగుతోందో అర్థంకాక బావురుమంది.

ఓ పక్క గుడ్డలన్నీ మూట కిడ్తూ. మరోవక్క సంటోణ్ణి ఏడుస్తున్న 'లచ్మి'ని మొగుడు 'రాములీన్ని' 'దేవుణ్ణి'బండబూతులు తిడ్తోంద సెంద్రి. సెంద్రి మనసంతా కంగారయిపోయింది. "ఎలాగెలాగ" అనుకుంద అనేకమాట్లు.

"పెసిడెంటుగారి డాబాలోకిఎల్దామా" ప్రశ్నించింది బయటి కొస్తూ.

"ఇంకానయ్యం! అ పెద్ద కులపోళ్ళంతా ఆడే వుంటారు. నిన్నూ నన్నూ సుశారంటే నరికి పోగులెడ్తారు".

"లేదురా! ప్రెసిడెంటుగారు పొద్దుగాలనే రేడియోలో ఏది సెప్తారని అందర్నీ తీసుకు పట్నం ఎల్లినాడురా."

"అయితే మాత్తరం. ఊళ్ళో దొరలు రానిత్తారా నిన్నూ నన్నూ.... ఇదివరకేటయింది. మన కులాొఎద్దనే రావియ్యలేదు గందా! ఆడు నీట్లో పడి కొట్టుకుపోయినా ఒక్కడూ మాటాడ నేదు."

"మరింకేదకిరా!"

"అందరూ ఏడికెళ్తే ఆడికే!"

గూడెమంతా గంద్రగోళంగా ఉంది. చిన్నా పెద్దా మూటల ఎట్టుకుని పరిగెడుతున్నారు. రాములీన్ని. సెంద్రినీ. లచ్మినీ కలుపుకుని గూడెం జనమంతా ఊళ్ళో ప్రవేశించింది.

ఊళ్ళోని పూరింటి పెంకుటింటి ఆసామీలు ఒక్కళ్ళూ పత్తాలేరు. కొందరు ఊరొదిలి పట్నమెళ్ళితే. మరికొందరు డాబా ఇళ్ళల్లోకి వర్దుకున్నారు.


కురుస్తున్న వాన కొద్దికొద్దిగా పెద్దదైంది. కుంభవృష్టిగా మారింది కటిక చీకట్లో అందిన అరుగులవెంట. లోగిళ్ళలోకి గూడెం జనం స్థిరపడిపోయారు.


జోరున కురుస్తున్న వానతో పాటే. గాలికూడా ఉధృతమైంది. చెట్లు ఫెళఫెళా విరిగివదుతున్న చప్పుదు. పెంకులు ఎగిరిపోతున్న శబ్దాలు. తాటాకుల మోతలు. చీకట్లో దారి కనవడక అల్లాడిపోతున్న జనం కేకలు. గొడ్లు అరుస్తువన్న మోత. వాతావరణం భయంకరంగా మారుతోంది.

అదే నమయంలో నముద్రపు అలలు ఉవ్వెత్తువ లేచి వల్లంగా ఉన్న ఆ పల్లె ప్రాంతంలోకి వురవళ్ళు తొక్కుతూ ప్రవేశించింది. నీటి ప్రవాహం. కొద్దికొద్దిగా పెరిగి మోకాళ్ళవరకూ వచ్చేసింది. గూడెం జనాలకి అప్పటికి మృత్యు చిహ్నాలు కొద్ది కొద్దిగా కనవడటం ప్రారంభించాయి.

గుండెలవిసిపోయేలా పెడుతున్న కేకలు మిన్నుముట్టాయి. చెట్టుకొకరుగా ఇంటికొకరుగా చెల్లాచెదరైన జనం ఇళ్ళ కప్పులపైకి ఎగబాకుతున్నారు.

రాములు కూర్చున్నది అదృష్టవశాత్తు ఓ పెంకుటింటి వసారా. అక్కడినుంచే తడుముకుంటూ చెక్కలు పట్టుకుని పెంకుటింటి మీదకి ఎగబాకాడు. సెంద్రి కుర్రోణ్ణి చీకట్లోనే రాములు కందించి. లచ్మి చెయ్యి పట్టుకుని అందించింది. మొత్తం మీద ఎలాగైతేనేం కుటుంబమంతా పెంకుటింటి కప్పు మీద స్థిర పడ్డారు.



ఏడుస్తున్న పసివాడిని సముదాయించటానికికూడా సెంద్రికి ధైర్యం చాలటంలేదు. లచ్మి ఆగకుండా ఏడుస్తూనేఉంది. పొద్దుటి నుంచి కడుపులో ఏమీ పడకపోవడం వల్ల అలసటతో, భయంతో ఆకలితో అత్తిపత్తి ఆకుల్లా ముడుచుకుని వెలుగు కోసం చూస్తూ మౌనంగా కూర్చున్నారు.

చీకట్లో అప్పుడప్పుడూ 'బుడుంగు' మనే ధ్వనులూ, ఏడుపులూ బొబ్బలూ, అరుపులూ, సముదాయింపులూ, వేధింపులూ, తిట్లూ, గందరగోళంగా గాలిలో కలిసిపోతున్నాయి నీటి ఉరవడి పెరిగి ఇంటిని చుట్టుముట్టిందనే విషయం తెల్లవారేవరకూ 'రాములు'కి గానీ సెంద్రికిగాని తెలియలేదు. తెలతెలవారేసరికి ఇంటికప్పువరకూ వచ్చిన నీళ్ళు ఇంక పైకి రాలేక అక్కడే ఆగిపోయాయి.

తుఫాను తీవ్రత కూడా తగ్గింది. గాలి జోరు తగ్గింది. వానతో ఆగి పోయింది. ఒక్కసారి చుట్టూ పరికించింది 'సెంద్రి' దాదాపూ అందరి పరిస్థితి తమ స్థితిలాగే ఉంది.

ఇంటి కప్పులపై గూడెం జనం కేకలు వేసుకుంటున్నారు. ఎవరెవరు వరదలో కొట్టుకుపోయింది భేరీజు వేస్తున్నారు. కొందరు చనిపోయిన వారి గురించి విచారిస్తున్నారు. కొందరు బ్రతికి బయటపడినందుకు చాలా సంతోషిస్తున్నారు. అయితే ప్రవాహపు వడి తగ్గనందువల్ల ఎవ్వరూ కదిలే సాహసం చెయ్యడంలేదు.

ఇంతలో ఇళ్ళ కప్పులపైనుంచి ఓ గాలి వార్త. గాలితో పాటే అందరికీ చేరింది. 'హెలికాప్టర్లు వస్తున్నాయట. అన్నం పొట్లాలు ఇస్తారట. పడవలు కూడా వస్తున్నాయట'.

అందరికీ కొండంత ధైర్యం వచ్చింది. ఆకాశంకేసి చూస్తూవుండిపోయారు. అయితే మధ్యాహ్నం వరకూ ఏ 'పడవ' జాడా లేకపోవడంతో నిరుత్సాహం వచ్చేసింది 'రాములు'కు. ఒక వైపు 'లచ్మి' ఆకలి ఆకలి అంటూ కొరికేసి. సొమ్మసిల్లి పడి పోయింది. "సీ ఎదవ బతుకు" అని తిట్టుకుని ప్రభుత్వం మీద తనకున్న సదభిప్రాయాన్ని యాక్షన్‌తో సహా చెప్పాడు.

*        *        *

మధ్యాహ్నం దాటి సాయంత్రమవబోతుండగా "డుర్‌ర్‌ర్. ర్‌ర్‌ర్" మనే శబ్దంవినపడింది. ప్రాణాలు లేచొచ్చాయి రాములుకూ సెంద్రికీ. పక్క ఇంటి మీదున్న ఈరడు ఆనందంతో గంతులు వేస్తున్నాడు.

హెలికాప్టర్ మొదట చుక్కలా. ఆతర్వాత క్రమక్రమంగా పెద్దదౌతూ వచ్చేస్తోంది. అక్కడక్కడా ఆగి పొట్లాలు విసుర్తోంది. అన్నం పొట్లాలు... అందరికీ నోరూరిపోతోంది.

హెలికాప్టర్ మోతకు సొమ్మసిల్లి పడున్న "లచ్మి" కూడా ఠంగున లేచింది.

"ఏంటయ్యో అమ్మో! పొట్లాలు" అడిగింది.

"అన్నమే! మనక్కూడా ఇసుర్తారు" అన్న తర్వాత అనుమానమొచ్చి "ఏరా! ఇక్కడ ఏత్తరంటావా! ఎల్లిపోతారా!" అడిగింది.

"ఎల్లటమెక్కడికి? ఇంత పెద్దింటిమీద కూచున్నాం. మనకియ్యక ఇంకెవరికిస్తారు. అన్నం పొట్లాలు".

హెలికాప్టరు రాములు అభిప్రాయంతో ఏకీభవించలేదు. పక్కింటి మీద ఓ పొట్లం వదేసి ఎగిరిపోయింది హెలికాప్టరు. అమ్మనీ, అబ్బనీ బండబూతులుతిడ్తూ కూలబడ్డాడు రాములు. అందరికన్నా ఎక్కువ నిరాశపడింది "లచ్మి" మళ్ళీ



ఆకాశంవేపు ఆశగా చూస్తూ కూర్చుంది "లచ్మి".

మళ్ళీ ఓ హెలికాప్టరొచ్చింది. అయితే దీంట్లోంచి ఏవీ రాలడం లేదు. ఎవరో ఓ పెద్దాయన చెయ్యి ఊపుతూ ఎగిరివెళ్ళిపోయాడు.

చీకటి పడబోతుండగా మరో హెలికాపరొచ్చింది అన్నం పొట్లాలతో. రాములు నెత్తిపైన ఎగుస్తూ ఓ రెండు పొట్లాలు పడేసింది.

ఆత్రంగా అందుకోబోయాడు. ఆకలితో ఉన్న లచ్మి కూడా చేతులు చాపి ఆత్రంగా రాముల్ని నెట్టడంతో పొట్లం కాస్తా నీటి పాలై పోయింది.

పట్టరాని కోపంతో వంగచీసి గుద్దాడు రాములు. నియ్యమ్మ! నువ్వు దరిద్రదేవతవే!" అంటూ బుగ్గలు పిండి నెత్తిపై మొట్టాడు.

అయితే "సెంద్రి"కి దగ్గర్లో ఓ పొట్లం పడటంతో. దాన్లోదే గుస్గుసూ చెరికాస్త తిని తృప్తిపడ్డారు.

"ఏంటే పొట్లం మీద రాసుంది" అంది సెంద్రి.

రాములు కూడా చూశాడు. అదో ఎన్నికల గుర్తు

"ఏదో పార్టీ వాళ్ళదే! ఓట్లెయ్యమని రాసుంది దీనిమీద".

"ఇంత వరదల్లోనూ ఓట్ల ఊసెత్తకపోతే సస్తారు గావును" ఈసడించింది సెంద్రి.

మరో హెలికాప్టరొచ్చింది గాని అది నీటి మూటల్నే వేసింది

"నీళ్ళెందుకు! ఇన్ని నీళ్ళుండగా:" ఆశ్చర్యపోయింది సెంద్రి.

"అన్నం పెట్టకుండా నీళ్ళు తాపిస్తారేంట్రా నాయనా" ఆక్రోశించాడు రాములు.

ఆకలి మళ్ళీ విజృంభించింది. ఆకల్తో పాటే చీకటి కూడా పెరుగుతోంది. నీటి మట్టం తగ్గుతున్నా. వడిహత్రం తగ్గటంలేదు. సన్నగా తుప్పర పడుతోంది.

ఇంతలో మరో హెలికాప్టరొచ్చింది అన్నం పొట్లాల్తో. టపటపా పడ్డాయి రాములు కూర్చుని ఉన్న ఇంటిమీద.

ఆబగా చూస్తున్న 'లచ్మి' ఒక్క పరుగుతో అటువైపు పరుగు తీసింది రాములు కూడా వెళ్ళబోయాడు. కానీ అంతలోనే ఊహించని సంఘటన ఒకటి జరిగిపోయింది.

'లచ్మి' ఆత్రంగా వెళ్ళడంలో ఓ చోట పెంకుల్లేని చోట కాలేసింది. అక్కడి చెక్క-బద్దలు ఫెళ ఫెళా విరిగాయి. విల దొక్కుకునే ప్రయత్నంలో 'లచ్మి' గింజుకోవడం. బంతిలా ఇంటిమీదనుంచి దొర్లిపడటం. నీళ్ళల్లో 'బుడుంగు'మన్న శబ్దం ఊహించని విధంగా వెంట వెంటగా జరిగిపోయాయి

"ఓర్నాయనో! నా పిల్ల నీళ్ళ పాలయిందర్రో" గట్టిగా కేకలేస్తూ 'సెంద్రి' రచ్చిచ్చండ్రో కాపాడండ్రో నాకూతుర్ని" ఏడుస్తోంది

అటు అడుగు వేయబోయాడు రాములు. అయితే పక్కయింటి మీదున్న 'ఈరడు' గట్టిగా కేకలేశాడు.

"అరె పెల్లక్రో! వడిబాగావుంది! నిన్నుకూడా ఈడ్చేస్తదిరో జాగర్త".

ఆ మాటలో సెంద్రికూడా రాములు కాళ్ళు గట్టిగా పట్టేసుకుంది. "నువ్వెల్లకురో! ఈదే మనబిడ్డనుకుందాం నువ్వెల్లకురో".

రాములు పేగు కదిలిపోయినట్లుగా అయింది తన కూతురు తన ఎదుటే నీళ్ళపాలై కొట్టుకుపోయేసరికి పిచ్చెక్కినట్టుగా అయిపోయాడు.

అది పుట్టినప్పట్నుంచీ ఇప్పటివరకూ తానెలా కొట్టాడో చెబుతూ వెక్కి వెక్కిఏడ్వసాగాడు. అనుకోని సంఘటనగా జరిగిన లచ్మి మునకతో సెంద్రి మనసంతా వికలమైపోయింది.

రాత్రంతా ఆలోచిస్తూ. ఏడుస్తూ కూర్చున్నారు 'రాములు'. 'సెంద్రి'.

* * *

మళ్ళీ తెల్లవారింది. మళ్ళీ మరోసారి వెలుగు కానవచ్చింది.

నీటి మట్టం క్రమక్రమంగా పడిపోయింది నెమ్మదిగా ఇంటి మీదినుంచి క్రిందికి దిగారు రాములు. సెంద్రి. చంకన పసివాడితో.

అప్పటికే గూడెంవాళ్ళంతా ఊరికి కొంచెం దూరంలో ఉన్న మిట్ట మీదకి ప్రయాణమై వెళ్ళిపోయారు. ఏణ్ణర్థం క్రితం ఉప్పెనప్పుడు అక్కడే అందరికీ భోజనాలు వగైరా పెట్టడంవల్ల సహజంగానే అందరి అడుగులూ అటే పడ్డాయి.

* * * *

మర్నాటికి నీటి జాడలు మిగిలాయి. సూర్యుడు కూడా హడావుడిగా లోకం మీదికి వచ్చేశాడు.

సూర్యుడితో పాటే వలవల ఏడుస్తూ రాజకీయ నాయకులూ వగైరా కూడా రంగప్రవేశం చేశారు. సంఘసేవకులు. విలేకరులు. అధికారులు. అనధికారులు క్రమక్రమంగా ఆయా ప్రాంతాల్ని చేరుకుంటున్నారు. శవాల లెక్కలు చూస్తున్నారు. నష్టాన్ని అంచనా వేస్తున్నారు.

సెంద్రి. రాములు గూడెం వైపుకు కదిలారు. గూడెం వల్లకాడుగా మారి ఉంటుందని వారు ముందే ఊహించారు. దారి పొడుగునా గుండెను కదిలించివేసే దృశ్యాలు. ఉబ్బిపోయిన శవాలు. భరింపలేని దుర్వాసన. కొట్టుకుపోయిన రోడ్లు. కూలిపోయిన ఇళ్లు. చెట్లూ భయం భయంగా నడుస్తున్నారు రాములు. 'సెంద్రి'.

రాజిగాడి కేకతో ఇద్దరూ వెనక్కి తిరిగారు.

"లచ్మి శవం అడ పడుంది— తొందరగా ఎల్లండి" అంటూ వివరాలు చెప్పాడు రాజిగాడు. వరుగు పరుగున అక్కడికి ఏడుస్తూ చేరుకున్నారు. కానీ అక్కడి దృశ్యం వేరు.

మరెవరో 'లచ్మి' శవం చుట్టూ మూగి ఏడుస్తున్నారు. ఎవరో అధికారులు వాళ్ళు చెప్పేది నోట్ చేసుకుంటున్నారు. ఫొటోలు తీస్తున్నారు.



"లచ్మి" శవాన్ని చూడగానే పెంద్రి పెద్ద కేకవేసి శవంపై బడి ఏడవసాగింది. "ఏటిది? ఎవరమ్మా నువ్వు?" అడిగాడు అక్కడ ఏడుస్తున్న మరో పెద్దమనిషి. జవాబు చెప్పే స్థితిలో లేదు పెంద్రి. 'లచ్మి' 'లచ్మి' గుండెలు పగిలిపోయేలా ఏడుస్తోంది.

అప్పటి వరకూ ఏడుస్తున్న అవతలి పార్టీ తెల్లబోయింది.

"ఎవురమ్మా నువ్వు! ఇది మా 'రత్న'. 'లచ్మే'వరు? నువ్వెవరు? పో అవతలికి!"

"లేదిది మా లచ్మే" ఏడుస్తూనే అంది పెంద్రి.

"అవును మా లచ్మే" అందుకున్నాడు రాములు.


అవతలి పార్టీ ముఖాలు భయంకరంగా మారిపోయాయి.

"ఏటే! ఇది నీ కూతురంటివా ఏటి? బగేగుంది కత."

"ఇది నా కూతురే బాబూ?" బావురుమన్నాడు రాములు.

అంతకన్నా బావురుమని ఏడ్చింది ఓ వెడల్పుముఖం ఆడది.

"బాబూ! నీకు శవంతాలూకు గవర్నమెంటు సొమ్ము కావాలంటే పట్టుకుపో! నా కూతుర్ని నీ కూతురనకు బాబో!"




అధికారులు విచారించారు. నోసలు చిట్లించారు. "బార్వేరి యస్పా" అనుకున్నారు. "శవ రాజకీయాలు" అన్నారు. "రాములాంటి వాళ్ళని తన్నాలి" అని తీర్మానించారు.

"ఎల్తావా! పట్టుకు తన్నమంటావా నియ్యబ్బ!" అరిచాడో సాహసి.

"లచ్మి" శవం మాట దేవుడెరుగు—ఇంకాస్సేపుంటే తాము శవాలవ్వాల్సొస్తుం దనిపించింది రాములుకు. ఏడుస్తున్న పెంద్రిని ఈడ్చుకు తీసుకుపోయాడు.

రాములికి కడుపు మండిపోతోంది. తన కూతుర్ని "నీ కూతురు కాదు పో" అన్నారు. రుజువెడదామంటే గూడెంవాడు ఒక్కడూ అగుపడలేదు. కసిగా, తిక్కగా నేలకేసి కొట్టాడు చేతిలో మూటని. బువుతీరేదాకా తిట్టాడు. ఎవర్ని తిట్టాడో ఎవరికీ అర్థం కాలేదు.

ఆలోచన తళుక్కుమంది రాములు మదిలో, పల్లెకు పక్కనున్న ఏటి దగ్గరకు పరిగెత్తాడు. ఆశగా చూస్తున్నాడు.

జలదేవత కరుణించింది!!....

శవాలొస్తున్నాయ్.

✻


# తలనొప్పులెన్నెన్నో



# చికిత్స ఒకటి!

# అనాసిన్

దీన్లో బాధనివారణశక్తి ఎక్కువగాఉంది

వెంటనే ఉపశమనం యివ్వడం కోసం అనాసిన్‌లో, ప్రపంచమంతటా డాక్టర్లు ఎక్కువగా సిఫార్సు చేసే బాధానివారక ఔషధాలు మరింత ఎక్కువగా ఉన్నాయి.

తలనొప్పి, జలుబు, పడిశెం, ఫ్లూ, నడుం నొప్పి, కండరాల నొప్పి, పంటి నొప్పి, వీటికోసం చాలా బాగా పనిచేస్తుంది.

కేవలం అనాసిన్ పైనే విశ్వాసం ఉంచండి.

ఇప్పుడు సురక్షితమైన ఫాయిల్ ప్యాకింగ్‌లో.



శక్తివంతమైన మరియు విశ్వసనీయమైన మేనర్స్ అనాసిన్

భారతదేశపు నం. 1 నొప్పిని నివారించే ఔషధం

* Licensed user of T.M.: Geoffrey Manners & Co. Ltd. GM-1-84 TL